## స్నేహవారం వారం

# సెక్యూరిటీ

అవసరాల రామకృష్ణారావు

మా పక్కవీధి కార్నర్‌లో ఉన్న పరిమళా ఎపార్ట్‌మెంట్స్‌లో తెలుగువాళ్లు దిగారని తెలియగానే నా ప్రాణం లేచివచ్చింది. ఆ సండేనాడే వెళ్లి రమేష్‌ని కలుసుకోకుండా ఉండలేకపోయాను.

అతనూ నాలాంటివాడే. నిమిషంమీద మా స్నేహం పెనవేసుకుపోయి నువ్వు నువ్వనే స్టేజికి చేరుకోడానికి నిండా రెణ్ణెల్లు కూడా పట్టలేదు. అతని భార్య విమల కూడా ఏదో జాబ్ చేస్తోంది. ఏమాత్రం మొహమాటపడకుండా ఎప్పుడెళ్లినా ఎంతో ఆప్యాయంగా పలకరిస్తుంది. రమేష్ నాకంటే ఓ పదిహేనేళ్లు పెద్దవాడు. అయినా ఎప్పుడూ నవ్వుతూ చురుకుగా ఉండడం చేత ఉన్న వయసుకన్నా బాగా చిన్నవాడుగా కనిపిస్తాడు. పెళ్లయి పుష్కరం గడిచినా ఫ్రెష్‌నెస్ తగ్గని ముచ్చటైన దాంపత్యం వాళ్లది. ఇప్పట్లో పిల్లలు వద్దనుకున్నారు కాబోలు. అనే నా ఆలోచన సరికాదనే సమాచారం కూడా నాకు అందింది. పన్నెండేళ్ల వాళ్ల బాబీ ఢిల్లీలో కాబోలు ఏదో రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంటున్నాట్ట. పెద్దదిక్కు అనేది లేకపోవడం ఒక్కటే వాళ్లకున్న లోపం కాబోలు అనే నా సానుభూతి కూడా అవసరం లేని అదృష్టం వాళ్లది. రమేష్, అమ్మ సుభద్రమ్మగారు వాళ్లతోనే ఉందిట.

మేమిద్దరం చూడబోతే చీకటిపోగానే గూడుని డిచి మళ్లీ చీకటి పడ్డాకే గూడు చేరుకునే పక్షుల్లాంటి వాళ్లం. ఇంతటి మహానగరంలో మన భాషగాని ఈ మారుమూల ప్రాంతపు క్వార్టర్సులో పాపం మా అమ్మ రోజురోజంతా బిక్కు బిక్కుమని గడపాలి. మునుపైతే మా బాబి గాడైనా ఉండేవాడు. ఇన్నాళ్లకి కాస్త భాష తెలిసిన వాడిని దగ్గరకి వచ్చాను. అయితే ఏం లాభం? కిందటేడు వచ్చిన వైరల్ ఫీవర్‌తో ఆవిడ ఓకల్ కార్డ్స్ దెబ్బతిన్నట్టున్నాయి. నువ్వేం మాటాడినా వింటోంది గాని మాట్లాడగలిగే శక్తి కోల్పోయింది మరి.

అంటూ తల్లిని ఇంట్రడ్యూస్ చేశాడు రమేష్. స్వరపేటిక దెబ్బతింటే తిందిగాని మనిషి మాత్రం ఆ వయసుకి ఆరోగ్యంగానే కనపడింది నాకు. ఆ మాటే తర్వాత అతన్తో అనబోతే పైకి అలా కనపడుతుంది గానీ బాగా ముదిరిన డయబిటీస్ పేషెంట్ అని చెప్పాడు రమేష్.

ఆ తర్వాతి నుంచి నా మనసు వాళ్లిద్దర్నీ ఒదిలిపెట్టి సుభద్రమ్మగారి చుట్టూ తిరుగుతూ వచ్చేది. దానికితోడు వాళ్లింటి పక్క నాటా సునీల్‌తో పరిచయమైంది నాకు. సుభద్రమ్మ గురించి అతను చెప్పే విషయాలు వింటున్నకొద్దీ ఉన్న మతి పోయినట్టయింది నాకు.

అయ్యోరామా, ఇన్నాళ్ల నుంచి వస్తూ పోతూ ఉన్నారు. ఆమాత్రం గ్రహించలేకపోయారా! ఇంత పెద్ద ఎపార్టుమెంటులో ఏ చిన్న పిల్లాణ్ణయినా అడిగి చూడండి. ఆ ముసలావిడ కష్టాలే చెబుతారు. మీ



సౌత్ ఇండియన్ ఫామిలీస్ చాలావరకూ ఇలాంటివేటగా!


నాకు బాగా హిందీ వచ్చునని వాడికి తెలుసు. అంతగా హిందీ అందకపోతే ఆ జాగాలో ఇంగ్లీషు జోడించి ఎలాగో విషయం అందుకునేలా చేస్తాడు. సుభద్రమ్మగారు చిన్నప్పుడేవో హిందీ పరీక్షలు కట్టి పాసయిందిట. పైగా ఏదైనా సులువుగా పట్టుకునే తెలివిగల మనిషి. కొడుకు కోడలూ అలా ఆఫీసుకి వెళ్లనిచ్చి ఇలా వచ్చి వీళ్లింట్లో కూచునేదిట. పాపం తన కష్టసుఖాలు చెప్పుకొనేదిట. గుండెలేని దేవుడు ఆ ఒంటరి దానికి ఆ ఒక్క అవకాశమూ లేకుండా చెయ్యాలా!

వాళ్లిద్దరు నా కళ్లెదుట మెదిలారు. ఎప్పుడూ నలగని బట్టలతో ఉంటారు. చెదరని చిరునవ్వుతో మాటాడుతారు. సౌత్ ఇండియన్స్ అందరికీ అపకీర్తి తెచ్చేటంత దుర్మార్గతని ఎలా దాచుకోగలిగారో! అత్తగారి జవహరీ, చాకిరీ తప్ప విమలకి మరొకటి అక్కర్లేక పోయిందంటే అర్థం చేసుకోవచ్చు. ఆ రమేష్‌కి ఇదేం బుద్ధి? మొగుడు ఏనాడో పోతే ఉన్న ఒక్క కొడుకుని ఒక్క చేతిమీద పెంచి పాపం ఆ మహాఇల్లాలు ఇంతటి ఉద్యోగస్థుణ్ణి చేసింది. ఈ ముసలితనంలో కొడుకు తల్లిని చూసుకోవలసిన తీరు ఇదేనా!

'దయలేని దేవుడు ఈ వయసులో ఆవిడ నోటికి వేసిన తాళం పరేసరి, తక్కిన తాళాల మాట?' అని సునీల్ చెప్పిన మాట నిజమో కాదో అని ఆ మర్నాడు నేనే పరిశీలించి చూశాను. సుభద్రమ్మ గారికి వేరే ప్రత్యేకించిన గదిలో అలమారకు కూడా తాళం.

వాళ్లిద్దరూ ఉద్యోగాలకి వెళ్లేముందు వీధి గదికి బయట ఎలాగూ తాళం వేస్తారు. కన్నతల్లిని ఖైదుచేసిన కఠినాత్ముణ్ణి క్షమించలేక పోయింది నా మనసు. ఓ శెలవురోజున అత్తగారిని తీసుకుని విమల దక్షిణేశ్వరం వెళ్లిన అవకాశం పురస్కరించుకుని రమేష్‌ని ధులిపి దుళ్లగొట్టేశాను. గుండెలు దీసిన బంటు, వాడెందుకు వెక్కువెదురుతాడూ. మొహంలో మారుతున్న రంగులు పైకి కనపడనీయకుండా తలవంచుకుని నెమ్మదిగా స్పష్టంగా తన పంజాయిషీ వివరించసాగేడు.

మా తప్పులేదని మాకు స్పష్టంగా తెలిసినా లోకనిందకు తట్టుకోలేక ఒక్కొక్కప్పుడు చీకాకుపడుతూ ఉంటాం. ఆ కలిగిన అశాంతి ఒకరిమీద ఒకరం ఆ ఆవేశంలో నెట్టుకుని ఘర్షణపడుతూ ఉంటాం. అది మా పిల్లాడిమీద నీడలా అయినా సోకి వాడి మనస్తత్వం కలుషితం కావడం మాకు ఇష్టం లేదు. అందుకే ఎంతో ఆలోచించి మనసు రాయి చేసుకుని



ఉన్న ఒకే ఒక కుర్రాణ్ణి దూరప్రాంతంలో పెట్టేశాం, మాది నిజమైన ప్రేమే అయితే వాడు హెల్దీగా పెరగడమే మా లక్ష్యం అవుతుంది గనక ...

'నేను అడిగింది మీ అమ్మగారి గురించి ...'

నేను చెబుతున్నది మా తాతగారి గురించి ... మా అబ్బాయ్, నేనూ, మా అమ్మా, వాళ్ల నాన్నగారూ ఇవన్నీ ఒకే పాదులోని మొలకలు గనక. ఈ జీన్సుకి పట్టిన అవలక్షణాల మూలవ్యాధి ఆయన అందించిందే గనక ... అడ్డురాకు ... నువ్వు అడిగేదాకా నేను ఆగేనా లేదా, నేను చెప్పేది పూర్తయేదాకా నువ్వు వినాలా, అక్కర్లేదా? సరే, శ్రద్ధగా వినుమరి ...


మా నాన్నపోయాక అయిదేళ్ల నన్ను తీసుకుని మా అమ్మ తన పుట్టిల్లు రాజమండ్రి చేరింది. మా అమ్మమ్మ ఎప్పుడో పోయిందిట. మా దొడ్డమ్మ ఉంది గాని వాళ్ల అత్తారి ఊర్లో స్థిరపడిపోయింది. తలచెడి ఇల్లుచేరిన మాఅమ్మ ఆ విధంగా చిన్న వయసులోనే ఆ ఇంటికి ఆడదిక్కుగా స్థిరపడింది. క్లుప్తంగా బతికి డబ్బు కూడిక వేసుకోవడం ఎలాగో అదొక్కటే మా తాతగారి నిత్యసాధనా, జీవితాదర్శమూ. అదే ఆ పది పదిహేనేళ్ల పాటూ మా అమ్మకి చెవిలో ఇల్లు కట్టుకుని నూరిపట్టున్నాడు ఆయన. ఇటు తండ్రి ఇచ్చిందీ, అటు మొగుడి దగ్గర్నుంచి వచ్చిందీ తరాల సరిపడే సిరి చేరినా చూసి చూసి పైసా కదపలేని లుబ్ధత్వం మా అమ్మలో స్థిరపడి పెరుగుతూ వచ్చేది అనుకుంటా.

మా మేనమామలు ఇద్దరు పై ఊళ్లలో సర్దుకున్నా ముగ్గురు మాత్రం పొలంమీదే తిరుగుతూ ఉండేవారు. ఇంటి పెత్తనం లభించిన మా అమ్మకి ఆవిధంగా ముగ్గురు ఇంటి కోడళ్లని సాధించే యాజమాన్యం కూడా చేజిక్కింది. పుట్టిల్లు చేరిన విధవరాలికి ధనమూ అధికారమూ లభిస్తే చెప్పేదేముంది. అందరి మీదా అత్తగారి తనం చూపించేది.

'సరే, ఇది పాత కథ. అదివరకే అత్తగారి చెలాయింపుకి అలవాటుపడిన ఆడది సొంత కోడలికి చివాళులిస్తుందా! హాయిగా ఖర్చు పెట్టుకుంటూ స్వేచ్ఛగా పెరిగిన విమల మొదట్లో ఇది తట్టుకోలేక గిలగిలలాడిపోయేది. అయినా గడుసుది గనక తన సమస్యని తనే పరిష్కరించుకోగలిగింది. నిశ్శబ్దాన్ని మించిన పదునైన మాటలేదని తెలుసుకుంది. వెంటనే ఉద్యోగంలో చేరింది. చల్లగా తనకు నచ్చే పద్ధతిలో ఇంటిని దిద్దుకుంది. కోడలు చేస్తే అత్తగారికి పనికిరాదు గనక ఆవిడ వంటని ఆవిడే చేసుకోమంది. తనమటుకు తనే పొద్దున్నే లేచి చేసుకుంటుంది. సాయంకాలం వచ్చాక మిగిలింది తీరికగా పూర్తిచేసుకుంటుంది.'

'మరి తాళాల మాటో — అని అడుగుతావు. చెప్పేనుకదా పుట్టుకతో ట్రెయినింగులో వచ్చిన పీనాసితనం ఆవిడకి పోలేదని. లేదా, పోదా టాక్సీలో వెళ్లవే తల్లీ అంటే వినదు. సిటీ బస్సులోనే వెడుతుంది. ఇంత వయసులో ఈ రోగిష్టి మనిషి ఎక్కడ పడిపోతే నేనెలా వెదకను! చెప్పి చెప్పి విసిగెత్తి ఆవిడ మేలుకోరే ఇలా చేశాను. డయబిటీసు ఎక్కడ పెరిగిపోతుందో అని పంచదార గల ఆ అలమారకీ తాళం వేయక తప్పడం లేదు. బాబీ ఉన్నప్పుడు వాళ్లిద్దరికీ క్షణం పడేది కాదు. అందుకే ఆ ఊరు పంపేశాను. నేను ఏ కఠినత్వం చూపినా కన్నతల్లి మీద కనికరంతోనే సుమా!'


# కుమతీశతకం




మధుర సుధారసపూరిత
మృదుభాషణనైపుణియును, మేనర్సును తా
నధికారి కెంత చెప్పిన
బధిరునకున్ చెప్పినట్లు వ్యర్థము కుమతీ!



నవ్వకుమీ మీ ప్యూనుతో
నవ్వకుమీ జూనియర్సు నలుగురితోడన్
నవ్వకు మీ టైపిస్టుతో
నవ్వకుమీ బాసుతోడ నయమిది కుమతీ!



నీరే ప్రాణాపాయము
నోరే కలహముల తెచ్చి నొప్పించునిలన్
నారియె నరులను ముంచులను
చీరయె బరువగును నేటి స్త్రీలకు కుమతీ!



వినవల దెవ్వరి మాటలు
కనవల దటు ఇరుగుపొరుగు కష్టసుఖంబుల్
చనవలదే చర్చలకును
మనవలదెప్పటికి మంచి మనిషిగ కుమతీ!

— కొసల నాగభూషణం